
పెద్దకధ

# బామ్మగారి సామెతలు



— పుప్పాల సూర్యకుమారి

(గతసంచిక తరువాయి)

సరిగ్గా అప్పుడు ఓ కాకుల గుంపు వచ్చి వాడి ఎదురుగా ప్రత్యక్షమైంది. వాడి కళ్ళు విజయగర్వంగా మెరుస్తాయి. మనసు ఆనందంతో గంతులు వేస్తుంది. కాకులు గుంపులు గుంపులుగా చేరి చొరబడి ఆదరాబాదరాగా ఆ బియ్యం కాస్తా తింటుంటే వాడి మనసు ఏదో తెలియని సంతోషంతో నిండిపోయింది. ముఖంలో విజయం తాలూకు మెరుపు రేఖలు తొణికిసలాడుతున్నాయి. కాకులూ...కాకులూ! తినండి! తినండి! పాపం అమ్మగారు మీకోసమే కష్టపడి డాబామీదకొచ్చి నాలుగు కిలోల బియ్యం ఆరబెట్టారు. అమ్మగారి ఆత్మశాంతిస్తుంది. తినంఢి తినండి!" అంటూ వాడు తానో పెద్ద ఘనకార్యం చేస్తున్నాననే ఫీలింగ్‌తో గంతులు వేయసాగాడు.

ఇంతలో క్రింద నుండి బామ్మగారు "ఏరా! వుల్లయ్యా! బియ్యం ఎలా ఉన్నాయ్!" అడిగింది.

"ఓ పావుకిలో ఉన్నాయండి! మీరింకా రాకండి! అన్నీ అయిపోయాకా వద్దరుగ్గాని!" అంటూ పైనుండి సమాధానం ఇచ్చాడు.

బామ్మగారి బుర్రలో ఏదో అనుమానం తలెత్తింది. పావుకిలో అంటున్నాడేవిటే! వెర్రిబాగుల వెధవ ఏంచేసాడో ఏమో! ఒక్కసారి పైకివచ్చి చూస్తాముందు!" తనలోతాను అంటూ పైకి చేరింది.

మేడమెట్లు ఎక్కడం వలన ఆయాసంపడుతూ "ఏరా! వుల్లయ్యా! బియ్యం ఎంతవరకూ వచ్చాయి! బాగా ఆరిపోయాయా!" అడిగింది.

"ఇంకో నాలుగు గింజలు మిగిలాయండి!" విజయగర్వంగా నవ్వుతూ చెప్పాడు.

"నాలుగు గింజలు మిగలడం ఏమిట్రా?" విస్తుబోయి ప్రశ్నించింది. కిలకిలా నవ్వుతూ, రెండు చేతులతోనూ చప్పట్లుకొడుతూ "కాకులన్నీ మొత్తం బియ్యం తినేసాయండి!" గర్వంగా చెప్పాడు.

బామ్మగారి దృష్టి అప్పుడు ఖాళీగుడ్డపై పడింది. "అయ్యయ్యో! నాలుగు కిలోల బియ్యం కాకుల పాలుచేసావు కదరా! ఓరి పిచ్చినన్నాసీ! కాకులు తినడానికా ఆరబోసాను?" కోపంగా అంటూ వాడి నెత్తిమీద గబగబా రెండు మొట్టికాయలు మొట్టింది. బామ్మగారి మొట్టికాయలతో తలనొప్పిగా అనిపించీ తల చేత్తో రాసుకొంటూ "మీరేకదండీ! కాకులు తింటాయి చూస్తూ కూర్చోమన్నారు? మీ ఆత్మశాంతిస్తుందనీ, మీ కోరిక తీర్చటంకోసం కాకులు బియ్యం అన్నీ తింటుంటే చూస్తూ ఊరుకొన్నాను!" అమాయకంగా అన్నాడు.

"ఓరి అయోమయం వెధవా? నీ తెలివి తెల్లారినట్టు ఉంది. నేను బ్రతికుండగానే నా ఆత్మకు శాంతులూ, సంతాపాలు తెలువుతావేంట్రా! వరేయ్! ఆ దేవుడు నీకింత మంద బుద్ధినిచ్చాడేమిట్రా...నా బుర్ర తినడానికా? అంటూ నెత్తీ నోరు కొట్టుకొని వాపోయింది బామ్మగారు.

* * * * *

మధ్యాహ్నం భోజనాలయిన తరువాత బామ్మగారు రామకోటి వ్రాసుకొంటోంది. ఆమెకు ఖాళీగా కూర్చోడం ఇష్టం ఉండదు...ఏదో ఒక పని చేస్తూండాలి. అలాగే ఎదుటవాళ్ళుకూడా ఖాళీగా కూర్చున్నా ఆమెకు తోచదు. ఏదో ఒక పని పురమాయిస్తుంటుంది.

వుల్లయ్య బామ్మగార్కి అభిముఖంగా నిలబడి ఆమె చేతిలోని పుస్తకాన్ని తిలకిస్తున్నాడు. ఉన్నట్టుండి "బామ్మగారూ! ఏవిటండీ వ్రాస్తున్నారు" అడిగాడు కుతూహలంగా.

"రామకోటి!"

"అంటే ఏవిటండీ?" ఉత్సుకతతో అడిగాడు, బామ్మగార్కి వళ్ళుమండి "నీ ముఖం కోటిరా!" అంది చిరాగ్గా.

మళ్ళీ అమాయకంగా ముఖంపెట్టి "అంటే ఏవిటండీ?" ప్రశ్నించాడు.

బామ్మగారు తలబాదుకొంటూ "ఓరినాయనో! నువ్వెక్కడ దొరికావురా నాకు? అందరి విషయాల్లోనూ, ఆరాలూ, కూపీలూ లాగే నాకంటే ఏడాకులు ఎక్కువే చదివావు? అయినా ఇవన్నీ నీకెందుకురా! అలా ఖాళీగా కూర్చునేబదులు ఏ మొక్కల్లోనో కలువు తియ్యచ్చుగా?" అంది గద్దిస్తూ.

"నిన్ననే కదండీ మొక్కల్లో కలువుతీసాం!" టకాలున చెప్పాడు.

"అయితే ఏదయినా పని చెయ్యి! ఇక్కడినుండి వెళ్ళు!" అంటూ గదమాయించింది.

వుల్లయ్య పెరట్లోకి వచ్చి ఏంపని చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. ఈ రోజు తాను చెయ్యవలసిన పనంతా తొందరగా ముగించేసుకున్నాడు. వాడికి ఏంపని చెయ్యాలో అర్ధంకాలేదు. ఉన్నట్టుండి వాడి దృష్టి వరండాలోని బల్లమీదున్న తెల్లటి ఇస్త్రీబట్టలుమీద పడింది. ఇంకేమీ ఆలోచించలేదు వెంటనే ఆ బట్టలు తీసుకొచ్చి నీటిలో ముంచి బండమీద దబాదబా బాదసాగాడు.

రామకోటి రాసుకొంటున్న బామ్మగారి చెవులకు పెరట్లోనుండి "దబ్బు...దబ్బు" శబ్దం వినవచ్చింది. బామ్మగారి భృకుటి ముడివడింది. "ఏంటబ్బా ఆ శబ్దం? ఈ తింగర వెధవ మళ్ళీ ఏం చేస్తున్నాడో ఏమో!" సందేహిస్తూ ఒక్క ఉదుటున లేచి వెళ్ళింది పెరట్లోకి.

అక్కడి దృశ్యం చూస్తూ తెల్లబోయింది. "వరేయ్! వరేయ్! నువ్వు చేస్తున్న పనేంట్రా? తెల్లటి ఇస్త్రీ బట్టలను పట్టుకొచ్చి నీట్లో ముంచుతావా? అసలే వర్షాకాలం బట్టలు ఆరడంలేదని బాధపడుతుంటేను....ఇదేంట్రా?" విసుక్కొంటూ

అడిగింది.

"మీరేకదండీ! ఏదో ఒక పనిచెయ్యమన్నారు? ఖాళీగా ఉండటం ఎందుకులే అని బట్టలు జాడిస్తున్నాను!" అన్నాడు.

"పనిలేని మంగలి పిల్లితల గొరిగాడట! నీకులాగానే!" అంది.

వుల్లయ్య ఆమె దగ్గరగా వచ్చి "అమ్మగారండీ! అతడెవరండీ!" ఆసక్తిగా అడిగాడు.

చివ్వున కోపంగా చూస్తూ "నీలాటి వెధవే వాడూనూ!" అంటూ చిటపటలాడుతూ లోపలకెళ్ళిపోయింది.

కిశోర్ రీడింగ్ రూమ్‌లో డ్రాయరు ఎదురుగా కూర్చుని, పుస్తకాలు ముందేసుకొని చదువుకొంటున్నాడు. ఇంతలో పెరట్లోనుండి పిల్లి "మ్యాం...మ్యాం!" అంటూ అరవడం వినిపిస్తుంది కిశోర్‌కి. చదువుతున్న పుస్తకం ప్రక్కనపెట్టి "బామ్మా! నీ బుజ్జితల్లి ఏడుస్తోందే! అన్నం పెట్టవా?" అడిగాడు గట్టిగా.

బామ్మగార్కి మనవడి మాటలు వినిపించలేదు. రామకోటిలో నిమగ్నమైపోయింది.

బామ్మగార్కి ఓ పెంపుడు పిల్లీ, ఓ పెంపుడు కుక్క ఉన్నాయి. వాటిని ఆమె ఎంతో గారాబంగా చూసుకొంటుంది. కుక్కను ముద్దుగా బుజ్జిగాడు...పిల్లిని బుజ్జితల్లీ! అని పిలుస్తుంటుంది. ఒక్కొక్కసారి ఆ విషయంలోనే మనవడికీ, బామ్మగార్కి బేధాభిప్రాయాలొస్తాయి.

"బామ్మా! బుజ్జిగాడు, బుజ్జితల్లీ పేర్లు బాగాలే బాబూ! కొత్తవాళ్ళు ఎవరైనా వింటే మనుషులెమో అనుకొంటారు. నువ్వు పిల్లికీ, కుక్కకూ పెట్టిన పేర్లని మాత్రం ఎవ్వరూ అనుకోరు!" అంటు... వాడు.

దానికి ఆ పెద్దావిడ "వరేయ్! లోకంలో వరూ పెట్టని పేర్లు పెట్టాలనుకొన్నాను. పెట్టాను అంతే. నా నిర్ణయంలో మార్పుండదు. నీకిష్టం ఉంటే ...లు, లేకపోతే మానేయ్!" అంది కోపంగా. దానితో ...ర్ మరిక మాట్లాడలేదు.

మళ్ళీ పిల్లి "మ్యాం...మ్యాం..." అంటూ బిగ్గరగా అరవటం వినిపించింది కిశోర్‌కి.

"బామ్మా! వెళ్ళవే నీ బుజ్జితల్లి ఏ కష్టంలో ఉందో ఏమో బిగ్గరగా అరుస్తోంది" గట్టిగా పిలిచాడు కిశోర్

ఈసారి మనవడి పిలుపు బామ్మగారి చెవినపడింది. వ్రాస్తున్న పుస్తకం ప్రక్కనపెట్టి "ఇప్పుడే ఇంత పెరుగన్నం పెట్టివచ్చాను. ఎందుకేడుస్తోందో బుజ్జితల్లీ!" అనుకొంటూ కంగారుగా లేచివెళ్ళింది పెరట్లోకి.

అక్కడి దృశ్యం చూసి నిశ్చేష్టురాలైపోయింది.

వుల్లయ్య పిల్లి నాలుగు కాళ్ళు తాడుతో బలంగా కదలకుండా కట్టేసి, కత్తితో దాని తల గొరుగుతున్నాడు.

"అయ్యో! అయ్యో! నా బుజ్జితల్లి తల గొరిగేస్తున్నాడు. వరేయ్ కిశోర్ ఓసారిటురారా!" అంటు బిగ్గరగా మనవణ్ణి పిలిచి...వుల్లయ్య దగ్గరకొచ్చి "నా తల్లికి ఎంత కష్టం వచ్చిపడిందీ? నీ చేతులు పడిపోనూ!" అంటూ వాడి వీపుమీద దబదబా బాదింది.

ఒక్క అంగలో కిశోర్ పరుగెత్తికొచ్చి "ఏమైందే బామ్మా!" అడిగాడు ఆందోళనగా.

"వరేయ్! కిశోర్! ఇలాచూడ్రా నా బుజ్జితల్లి తల ఎలా గొరిగేసాడో!" అంటూ ఫిర్యాదు చేసింది.

అక్కడి దృశ్యాన్ని చూచిన కిశోర్ వళ్ళు కదిలేలా పగలబడి ఒకటే నవ్వసాగాడు.

"నీకు నవ్వులాటగా ఉందా!" బామ్మగారు మనుమడివైపు ఉరుముతూ చూసింది.



**డ్రీంబోయ్**

కలువ కన్నుల చంద్రచూడ సింగ్ (మాచిస్ ఫేం) అంటే అమ్మాయిలు పడి ఛస్తుంటారు. సిగ్గరి అయిన టాబు లాంటి అమ్మాయి కూడా 'ఆ అబ్బాయి భలే వుంటాడు' అని చెప్పేంత ముద్దుగా వుంటాడు ఇంత మంది అమ్మాయిల హృదయాలను కొల్లగొట్టిన ఈ డ్రీంబోయి హృదయంలో స్పందన రేకెత్తించేది మాధురీదీక్షిత్ అట ఇతగాడు మాధురీదీక్షిత్ వీరాభిమాని అట. మాధురీదీక్షిత్‌తో కలసి ఎప్పుడెప్పుడు నటిస్తానా అని ఎదురు చూస్తున్నాడట.

"నవ్వక ఏడ్వమంటావా? నువ్వు వాడిదగ్గర ఏదో సామెత ప్రయోగించి ఉంటావు? అది తు.చ. తప్పకుండా పాటించడం వాడికి పరిపాటేగా? ఏం అన్నావో చెప్పు!" అడిగాడు కిశోర్.

"పనిలేని మంగలి పిల్లితల గొరిగాడట!" అని ఎరక్కపోయి అన్నానురా! నిజంగా వీడు అంతపని చేస్తాడనుకోలేదు!" అంటూ బామ్మగారు వుల్లయ్య చేతిలోని కత్తి లాక్కొని నెత్తిమీద రెండు మొట్టికాయలు మొట్టింది. "చేసిన వెధవపని చాలుగానీ, ముందు నా బుజ్జితల్లి కట్లు విప్పు!" అంటూ గదమాయించింది.

"ఉండండి! తల పూర్తిగా గొరగనివ్వండి!" అన్నాడు వాడి ధోరణిలో.

"బామ్మగారు విస్తుబోయి చూస్తూ "ఓరి వెర్రిబాగుల వెధవ! నా బుద్ధి గడ్డితిని నీ ఎదుట నోరు జారానురా! దాని తలకాదురా నా తల గొరగరా నా పీడ వదిలిపోతుందీ!" వళ్ళుమండి అరిచింది.

"బామ్మా! పొరపాటున కూడ వాడి ఎదురుగా నోరు జారకేబాబూ! నువ్వు ఏ నిద్రపోతున్నప్పుడో సమయం చూసి నీ తల గొరిగినా గొరిగేయగలడు! జాగ్రత్తసుమీ!" నవ్వుతూ అన్నాడు కిశోర్.

"గొరుగుతాడు, గొరుగుతాడు! వెధవ! అది నోరులేని జీవం గనుక ఊరుకొంది. నేనయితే కాళ్ళు విరగ్గొడతాను! " అంటూ పిల్లి కట్లు విప్పి పిల్లిని చంకలో వేసుకొని లోపల కొచ్చేసింది. బామ్మగారు పైకి గాంభీర్యంగా అన్నా ఆమె మనసులో మటుకు ఒకింత భయం–గుబులు పట్టుకొన్నాయి. తాను గాఢంగా నిద్రపోతున్న సమయంలోనో తన తల గొరిగేసినా గొరిగేయగలడు. తాను ఎక్కువగా మేలుకొనే ఉండాలి. అప్పటినుండీ బామ్మగార్కి పాపం కంటినిండా కునుకు లేకుండాపోయింది.

* * * * *

ఓ రోజు బామ్మగారి ప్రక్క పోర్షనులో ఉంటున్న మీనాక్షమ్మగార్కి, ఆమె కోడలికీ ఏదో విషయం మీద ఘర్షణ వస్తుంది. మీనాక్షమ్మ కోడల్ని తిట్టిన తిట్టు మళ్ళీ తిట్టకుండా తిడుతోంది. శాపనార్థాలు పెడుతోంది. కోడలు సన్నగా ఏడ్వటం వినిపిస్తోంది.

ఆ అమ్మాయి ఏడ్పు విన్న బామ్మగారి మనసు నీరైపోయింది. పాపం బామ్మగార్కి కాళ్ళూ, చేతులూ ఆడ్డంలేదు అటూ ఇటూ తిరుగుతోంది. వెళ్ళి ఆ అమ్మాయిని ఓదార్చాలనిపిస్తోంది. కాని, ఎదుటువాళ్ళ గొడవల్లో తలదూర్చటం అంత మంచిపని కాదని ఆ ప్రయత్నం విరమించుకొంది. ఈసారి మీనాక్షమ్మగారి కోడలు బోరున ఏడ్వటం వినిపించింది. మీనాక్షమ్మమీద వల్లమాలిన కోపం ముంచుకొచ్చింది. "మీనాక్షమ్మకు అసలు బుద్ధి లేదు. ఆ పిల్లని ఉదయం లేచిన దగ్గర్నుండి రాత్రి పడుకొనేవరకూ ఒక్క లెఖ్ఖన సాధిస్తునే ఉంటుంది. ఆ అమ్మాయిమీద చెయ్యి చేసుకొందో ఏమో పాపం ఏడుస్తోంది. ఎంత అత్తగారయితే మటుకు ఇంత కక్ష సాధింపా?" ఉండబట్టలేక ఈ విధంగా పైకే గొణుక్కొంది బామ్మగారు. ఆమె ప్రక్కనే నిలబడి ఉన్న వుల్లయ్య చెవిలో ఆ మాటలు కాస్తా పడ్డాయి. పాపం బామ్మగారు ఆ విషయం గ్రహించలేదు.

"వరేయ్! వుల్లయ్యా! మీనాక్షమ్మ కోడల్ని చితకబాదేస్తోందేమో! పాపం ఆ పిల్ల ఒకటే ఏడుపు? ఓసారి వెళ్ళి చూసిరా!" మనసాపక వాణ్ణి పంపించింది బామ్మగారు.

బామ్మగారు చెప్పిందే తడవుగా వుల్లయ్య ఎక్స్‌ప్రెస్‌లా రివ్వున ప్రక్క పోర్షన్‌లోకి దూసుకెళ్ళాడు.

మీనాక్షమ్మ ఎదుట నిలబడి "మీనాక్షమ్మగారూ! మీ కసలు బుద్ధి ఉందా? మీ కోడలిమీద చెయ్యి చేసుకొంటారా? మీరు ఎంత అత్తగారైతేమటుకు అంత కక్షసాధింపా?" అని వాడు గడగడా పాటం అప్పచెప్పినట్లు చెబుతుంటే, మీనాక్షి తెల్లబోయి గుడ్లప్పగించి వాడివేపు గుర్రుగా చూసింది.

మీనాక్షమ్మ రెండు క్షణాల్లో తేరుకొని "వరేయ్! ఒక పని వెధవ్వి నీవు నాకు నీతులు...వల్లిస్తావా? నీ కెన్ని గుండెలురా?" అంటూ కోపంగా వాడి వీపుమీద రెండు అంటించింది చేత్తో.

వాడు వీపుమీద చేత్తో రాసుకొంటూ "అవీ, మా అమ్మగారు అంటున్నారండీ!" దైన్యంగా చూస్తూ అన్నాడు వుల్లయ్య.

వాడిద్వారా అసలు విషయం తెలుసుకొన్న మీనాక్షమ్మకి బామ్మగారిమీద విపరీతమైన కోపం ముంచుకొచ్చింది. వరండాలోకొచ్చి, అగ్గిమీద గుగ్గిలమై పోతూ "సామెతల బామ్మగారూ! ఓసారి బయటికిరా!" గర్జిస్తున్నట్టుగా అరిచింది మీనాక్షమ్మ.

బామ్మగారి నెత్తిమీద పిడుగువడ్డట్టయింది. ఆమె ఎందుకలా చిందులు వేస్తోందో బోధపడలేదు. వరండాలోకొచ్చి "ఏమిటే మీనాక్షీ! ఏమైందే?" సావదానంగా అడిగింది.

"ఏమీ ఎరుగని నంగనాచిలా కబుర్లు చెప్పకు? నాకు బుద్ధిలేదని తిడతావా? నా కోడల్ని తిట్టుకొంటాను.. కొట్టుకుంటాను..అసలు నువ్వు ఎవ్వరివీ అడగటానికి? నీకు సంబంధం ఏమిటీ? మీ ఇంట్లో విషయాలు మేం పట్టించుకొంటున్నామా? ఎవరి హద్దుల్లో వాళ్ళుండటం మంచిది!" తీక్షణంగా అంది మీనాక్షమ్మ

బామ్మగారు నిశ్చేష్టురాలైపోయింది. "మీనాక్షీ! నేను ఎటువంటిదాన్నో నీకు తెలియదా! నిన్ను నేనెందుకు తిడతాను? నేనంటే కిట్టని వాళ్ళు నామీద ఏవో కల్పించి నీకు చెప్పి ఉంటారు. నాకేపాపం తెలియదే బాబూ! నా మాట నమ్మ!" అంది

## ఆ కొడుకు – ఈ తండ్రి

చదువుకునే కొడుకుని పిలిచి తండ్రి అడిగ2ఆడు ఏడిరా నీ ప్రోగ్రెస్ కార్డు?

లేదు చించి అవతల పారేశాను. సమాధానం చెప్పాడు కొడుకు.

ఎంత పనిచేశావురా అంతా తిట్టసాగుడు తండ్రి.

తిట్టబోకు, ఆ మార్కులు చూపి వుంటే నువ్వు అదే పని చేసే వాడివి అన్నాడు కొడుకు.

–కాట్రగడ్డ వెంకట్రావు,

బతిమాలుతూ!

"పైవాళ్ళు చెబితే ఎందుకు నమ్ముతాను. స్వయంగా మీ పనివాడే వచ్చి నువ్వు తిట్టావని పనిగట్టుకువచ్చి చెప్పాడు!" అంది మీనాక్షమ్మ అసలు విషయం చెబుతూ.

బామ్మగారు వుల్లయ్యను మింగేసేలా కోపంగా చూసింది. "వరేయ్! వెధవా! మీనాక్షమ్మని నేను తిట్టానా?" తీవ్రంగా అడిగింది విరుచుకుపడుతూ.

వుల్లయ్య ఏమాత్రం నదురూ బెదురూ లేకుండా టకాలున "ఇందాక మీరు మీనాక్షమ్మగార్ని తిట్టుకొన్నారుగా!" అమాయకంగా అడిగాడు.

"నోరుమూయ్! ఉన్నవీ, లేనివీ నామీద కల్పించి చాడీలు చెబుతావా? తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టే నీచుడా!" చూసి రమ్మంటే కాల్చి వస్తావురా? నడులోపలకు! అంటూ గర్జించి వాడి వీపుమీద దబదబా బాదేసింది.

అప్పుడే కాలేజ్ నుండి వచ్చిన కిశోర్ "ఏమిటే బామ్మా! వాడ్ని ఎందుకలా కొడుతున్నావు!" అడిగాడు.

బామ్మగారు మనుమడికి జరిగిన విషయమంతా వివరించింది.

"వాళ్ళ విషయాలు మనకెందుకూ? పెద్దదానివి నీకు ఆ మాత్రం తెలియదా? ఎదుటివాళ్ళ గొడవల్లో తలదూర్చటమంత చెడ్డపని మరొకటి లేదు. ఇక లోపలకెల్లండి!" ఇద్దర్నీ ఉద్దేశించి మందలించాడు కోపంగా కిశోర్.

"ఉండండి! వస్తాను! ఇందాక చూసిమాత్రమే వచ్చాను, ఇప్పుడు...కాల్చి రావద్దూ!" అంటూ వుల్లయ్య మీనాక్షమ్మ పోర్షన్‌లోకి దారితీసాడు.

వాడి మాటలకు బామ్మగారు అవాక్కయిపోయింది. నెత్తీ, నోరు బాదుకొంటూ ఇంత వెర్రిబాగులు వెధవ దొరికాడేవిట్రా బాబూ! గొణుక్కొంటూ...మెరుపులా వెళ్ళి వుల్లయ్య రెక్కపుచ్చుకొని లోపలకు ఈడ్చుకొచ్చింది.

"ఆ మీనాక్షమ్మకూ నాకూ మధ్య పెట్టావుకదా నివ్వూ....చాలు. ఇంకా నిప్ప పెట్టడాన్కి వెళతాడట... నిప్ప..!" అంటూ గొణుక్కొంది.

"అయినా బామ్మా! నీకు బుద్ధిలేదే! వీడ్ని ఎందుకు పంపించావు ఆ మీనాక్షమ్మ ఇంటికి!" విసుగ్గా అన్నాడు కిశోర్.

"బుద్ధి గడ్డితిని పంపించానురా! అయినా వీడు చూసి రమ్మంటే కాల్చి వస్తాడనుకొన్నానా?" అంది తన ధోరణిలో బామ్మగారు.

"అదిగో! మళ్ళీ మొదలుపెట్టావా? ఆ వెధవ సామెత వాడి దగ్గర ఉపయోగించవద్దని నీకు వందసార్లు చెప్పాను!" విసుక్కొంటూ అన్నాడు కిశోర్.

"అవున్రా బాబూ! ఈ రోజు నుండీ ఈ వెర్రిబాగుల వెధవ ఎదుట సామెతలు ఎత్తితే ఒట్టు!" అంటూ బామ్మగాగు చేత్తో చెంపలు వాయించుకొంది. ◆

